క్లుప్తంగా

పేర్ని నాని, కిట్టు సంక్రాంతి శుభాకాంక్షలు




కోనేరుసెంటర్/చిలకలపూడి: మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని నాని, వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు నియోజకవర్గ ప్రజలకు వేర్వేరు ప్రకటనల్లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ నియోజకవర్గ ప్రజల కుటుంబాల్లో సంతోషాలు నింపాలని, సకల సౌభాగ్యాలు కలుగజేయాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు.

ఆలయాలను సందర్శించిన న్యాయమూర్తులు



దేవస్థానంలో కృష్ణా జిల్లా జడ్జి అరుణ సారిక, కైకలూరు సీనియర్, జూనియర్ కోర్టుల జడ్జీలు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ, కైకలూరు శ్యామలాంబ అమ్మవార్ల దేవాలయాలను కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి అరుణ సారిక శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవోలు కేవీ గోపాలరావు, వీఎన్‌కే శేఖర్ ఆలయ మర్యాదలతో వారిని సన్మానించారు. ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు చేస్తూ పక్షుల అందాలను ఆస్వాదించారు. కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ.లక్ష్మి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు పి.గాయత్రి ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందజేత

పెడన: రెగ్యులర్ మున్సిపల్ కార్మికులకు యూనిఫాంను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శనివారం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ నాగకుమారి మాట్లాడుతూ ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించి వారికి ఐదేళ్లకు సంబంధించిన యూనిఫాం, టవల్స్‌ను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది నుంచి ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం కార్మికులకు అందించాల్సిన వాటన్నింటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పెద్దిరాజు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు శంకుస్థాపన

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ప్రయాణికుల వెతలు తీర్చేందుకే బస్ షెల్టర్ ఏర్పాటు నిర్మిస్తున్నామని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. కొక్కిలిగడ్డ కృష్ణా కరకట్ట పక్కన నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ కేటాయించిన ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో బస్‌షెల్టర్ నిర్మాణం చేట్టామని తెలిపారు. కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక, కె. కొత్తపాలెం సర్పంచ్‌లు దిడ్ల జానకీ రాంబాబు, దొప్పలపూడి గంగాభవానీ, కొక్కిలిగడ్డ మాధవి, మండల కో–ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, మాజీ సర్పంచ్ కేసాని శివుడు, దొప్పలపూడి జగదీష్, కేసాని వాసుదేవరావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి: పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని వాడపాలెం గ్రామంలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న మైక్రో ఫిల్టర్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తెలుసుకున్న ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మారుమూల గ్రామాలకు సైతం అన్ని సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో బందరు ఎమ్మెల్యే పేర్ని నాని పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుగుణ, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లికి చెందిన కళ్లేపల్లి రమేష్ పూరిల్లు శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. కళ్లేపల్లి రమేష్‌కు చెందిన పూరింట్లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. కొద్దిసేపటికే ఇల్లంతా కాలిపోయింది. టీవీఎస్ మోటార్ సైకిల్‌తో పాటు విలువైన వంట సామాన్లు కాలిపోయాయి. సుమారు రూ. 70 వేలు నష్టం వాటిల్లినట్లు వీఆర్వో వెంకట రమణ తెలిపారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి



వస్త్ర దుకాణంలో చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బందరులోని వస్త్ర దుకాణం



పిండి వంటలు సిద్ధం

పెడన/కృత్తివెన్ను: పల్లెసీమలు సంక్రాంతి శోభతో సందడిగా మారాయి. వేకువ జామునే హరినామ సంకీర్తనలతో హరిదాసులు సందడి చేస్తున్నారు. ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను అందమైన సంక్రాంతి ముగ్గులలో అంతే అందంగా అలంకరించడంతో ముంగిళ్లు అందమైన లోగిళ్లుగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు పల్లెలకు చేరుకోవడంతో పాటు, ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సొంత ఊళ్లకు చేరుకోవడంతో గ్రామాలు సందడి సందడిగా మారాయి.

దుకాణాలు కిటకిట..

మచిలీపట్నంటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా షాపింగ్ చేసేందుకు ప్రజలంతా దుకాణాలకు చేరడంతో నగరంలో హడావుడి నెలకొంది. నగరంలోని ప్రధాన రహదారిలో శనివారం వాహనాల తాకిడితో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. పలు దుకాణాల ముందు వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. కొనుగోలుదారులతో వస్త్ర, పండ్లు, పూలు, నిత్యావసర సరుకుల దుకాణాలు రద్దీగా మారాయి. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వాహనాలు చేరుకోవడంతో స్థానిక కోనేరు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ట్రాఫిక్ సమస్య నెలకొంది. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అధికంగా ఉండటంతో ఇతర మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇప్పటికే రకరకాల పిండివంటలను, బొమ్మల కొలువును సిద్ధం చేసుకున్నారు.



హరిదాసుకు కానుక ఇస్తున్న మహిళ



పెడనలో సిద్ధమైన బొమ్మల కొలువు



బందరు ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ

'జగనన్న తోడు'తో ఉపాధి వైపు అడుగులు



మెప్మా బజార్‌లో రోల్డ్‌గోల్డ్, చీరల వ్యాపారం నిర్వహిస్తున్న మహిళలు (ఫైల్)



మెప్మా బజార్‌లో క్లాత్ అండ్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్న మహిళలు

- నగరంలో 3,704 డ్వాక్రా స్వయం సహాయక సంఘాలు
- రూ. 10 వేల చొప్పున రుణాలు
- రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు లింకేజీ రుణాలు
- స్వయం ఉపాధి పొందుతున్న 700 మంది మహిళలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం ద్వారా ఎంతో మంది డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. పలు విడతల్లో జగనన్న తోడు పథకం ద్వారా వచ్చిన రూ. 10 వేలతో వారికి ఇష్టమైన వ్యాపారాలు ప్రారంభించడంతో పాటు మరికొంత మంది ఉన్న వ్యాపారాలను వృద్ధి చేసుకుంటూ ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. నగరంలో 3,704 డ్వాక్రా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 38,095 మంది సభ్యులుగా ఉన్నారు. నగరంలోని 1,555 మంది మహిళలకు ఈ ఏడాది జగనన్న తోడు పథకం ద్వారా రూ. 10 వేలు చొప్పున రుణం మంజూరైంది. ఈ రుణంతో దాదాపు 700 మంది మహిళలు చిరు వ్యాపారాలను ప్రారంభించి ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ లింకేజీ రుణాలను పొందుతున్నారు. లింకేజీ రుణాలకు ప్రభుత్వం పావలా వడ్డీ అమలు చేస్తుండటంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు గ్రూపు సీనియార్టీ ప్రకారం బ్యాంకులు లింకేజీ రుణాలు అందిస్తున్నాయి. నగరంలోని 1,488 గ్రూపులు ఈ ఏడాది రూ. 197 కోట్ల మేర రుణాలను పొందాయి.

వ్యాపారాలతో ఉపాధి..

నగరంలోని డ్వాక్రా మహిళలు పలు వ్యాపారాలు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. కొంత మంది దుకాణాలను ఏర్పాటు చేయగా మరికొందరు ఇళ్ల వద్దే విక్రయాలు చేస్తున్నారు. ముఖ్యంగా రోల్డ్‌గోల్డ్, కలంకారీ దుస్తులు, క్లాత్, చీరలు, వడియాలు, పచ్చళ్లు, తినుబండారాలు, డ్రై ఫ్రూట్స్, జ్యూట్ బ్యాగ్‌లు తదితర సరుకుల అమ్మకాలతో జీవనోపాధి పొందుతున్నారు. మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక రోజుల్లో నిర్వహించే మెప్మా బజార్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



నేను శ్రీవాణి డ్వాక్రా సంఘంలో సభ్యురాలిని. నేను కలంకారీ దుస్తులు, చేతి సంచులు, చేతి రుమాళ్లు తదితర వస్తువులను విక్రయిస్తున్నా. జగనన్న తోడు పథకం ద్వారా వచ్చిన రూ. 10 వేలను పెట్టుబడిగా పెట్టి వ్యాపారాన్ని అభివృద్ధి చేశా. ఇంటి వద్ద దుకాణంతో పాటు మెప్మా బజార్‌లో స్టాల్ ఏర్పా టు చేస్తా. తద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నా. జగనన్న తోడు పథకం ఎంతో ఉపయోగపడుతోంది. సీఎం జగనన్న చేసిన మేలు మరిచిపోలేను.

– ఎం అనూరాధ, చాకిరేవుపాలెం

రూ. 50 వేలతో రోల్డ్‌గోల్డ్ వ్యాపారం ప్రారంభించాం



ఇనుగుదురుపేటకు చెందిన మా ఉదయ స్వయం సహాయక సంఘానికి రూ.7 లక్షల లింకేజీ రుణం వచ్చింది. నాకు రూ. 70 వేలు ఇవ్వడంతో రూ.50 వేల పెట్టుబడితో రోల్డ్‌గోల్డ్, చీరల వ్యాపారం ప్రారంభించా. ఈ వ్యాపారంతో స్వయం ఉపాధి పొందుతున్నా. సీఎం జగనన్న మహిళలకు ఎంతో మేలు చేస్తూ అండగా నిలుస్తున్నారు. ఆయన రుణం తీర్చలేనిది.

– రూపలత, ఇనుగుదురుపేట

వెన్నంటే ఉంటున్న కార్యకర్తలే అండ

- కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వడంలో జగనన్నకు ఎవరూ సాటిరారు
- వైఎస్సార్ సీపీ కుటుంబమంతా ఐక్యతతో అడుగులు వేద్దాం
- పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము



మాట్లాడుతున్న ఉప్పాల రాము

పెడన: కార్యకర్తలే అండదండలని, మొదటి నుంచి అధిష్టానం మాటకు కట్టుబడి ఉన్నానని, పార్టీని నమ్ముకుని ఉన్నందుకు జగనన్న గుర్తింపు ఇచ్చారని, కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాటి ఎవరూ రారని పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. శనివారం సాయంత్రం పెడన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాము మాట్లాడుతూ 2012 నుంచి పార్టీని నమ్ముకుని ఉన్నామన్నారు. ఓసీలో కృష్ణాజిల్లా సీటు రిజర్వు అయినా కూడా పార్టీని నమ్ముకుని ఉన్న మా తండ్రి రాంప్రసాద్‌కు రెండు దఫాలుగా ఎమ్మెల్యే సీటు కేటాయించలేకపోయాననే విషయాన్ని గుర్తించి నా భార్య హారికకు కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి అప్పగించారని అన్నారు. అటువంటి జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా కలిసి పెడన ఎమ్మెల్యే సీటును గెలిపించుకుని, జగనన్నకు బహుమతిగా ఇద్దామని చెప్పారు. మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు ఆహర్నిశలు శ్రమిద్దామన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ఉప్పాల రాంప్రసాద్ పెడన నియోజకవర్గ ప్రజలంటే ప్రాణం ఇచ్చేవారని, వారి కోసం ఎంతో శ్రమించారని అన్నారు. ఆయన ఉండి ఉంటే ఎంతో సంతోషించేవారని చెప్పారు. అందరని కలుపుకుని ముందుకు అడుగులు వేస్తామని, మీ సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పెడన నియోజకవర్గ పరిశీలకుడు తన్నీరు వెంకట్రావు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చారుమతి, ఎంపీపీలు చినబాబు, మధుసూదనరావు, వాణి, జెడ్పీటీసీలు రత్నకుమారి, వెంకటరత్నం, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఖాజా, జ్యోతి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నాగబాబు, మహేష్, పెదబాబు, వెంకట్రాజు, మల్లి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: రుద్రహస్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ ఆమంచి లక్ష్మీస్రవంతి నగరంలోని నారాయణపురం యానాదుల కాలనీకి చెందిన 100 మంది యానాది కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. ఆమె మాట్లాడతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 1000 మంది పైగా విద్యార్థులను దత్తత తీసుకుని సొంత ఖర్చులతో చదివిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగను యానాది కుటుంబాలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. కార్యక్రమంలో కాళింగి శివ, వేపాశెట్టి విజయ్, రాము, తోట రవి, ఏనుగు సాగర్, గరికిపాటి ఆంజనేయులు, మరీదు నాని, పిప్పళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



అవనిగడ్డ: బందలాయి చెరువుకు చెందిన బీటెక్ విద్యార్థిని ఘంటా తనూజకు చైల్డ్‌హుడ్ గ్రూప్ ద్వారా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందించారు. స్థానిక ఎన్‌జీఓ సమావేశపు హాల్‌లో శనివారం 1981–1984 బ్యాచ్ అవనిగడ్డ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులతో ఏర్పాటు చేసిన చైల్డ్ హుడ్ గ్రూపు సంస్థ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ చైల్డ్‌హుడ్ గ్రూపు సంస్థ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. చైల్డ్‌హుడ్ గ్రూపు సంస్థ ఉపాధ్యక్షుడు కొండవీటి తులసీరావు, సెక్రటరీ బి. లీలాకృష్ణ, జాయింట్ సెక్రటరీ అలపర్తి గోపాలకృష్ణమూర్తి, కోశాధికారి కె. రత్నాకర్, పలువురు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



పురిటిగడ్డ(చల్లపల్లి): చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్ 1985–86 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం పురిటిగడ్డలోని ఐవీఎం కార్యాలయంలో శనివారం సందడిగా జరిగింది. ఏపీ, తెలంగాణ నుంచి 85 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. తమ చిన్ననాటి స్నేహితులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మీయంగా పలుకరించుకుని క్షేమసమాచారం తెలుసుకున్నారు. తాము చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని రోజంగా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో చిన్ననాటి స్నేహం కలకాలం నిలిచి ఉంటుందని, అది మాటలకందనంత మధురమైందని చెప్పారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

వైభవంగా నాగేశ్వరస్వామి తిరునాళ్ల



ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఉప్పాల రాము దంపతులు

బంటుమిల్లి (గూడూరు): ములపర్రు పంచాయతీ శివారు గొల్లగూడెం గ్రామంలోని పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి వార్షిక తిరునాళ్ల శనివారం ఘనంగా జరిగింది. స్వామి వారికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలలో కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పండితులు ఆలయ సంప్రదాయాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తిరునాళ్లను పురస్కరించుకుని మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది. వ్యవసాయ పనులు ముగియడంతో పెద్దఎత్తున పాల్గొన్న భక్తులతో తిరునాళ్ల సందడి నెలకొంది. ఎంపీపీ వి.చినబాబు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్. మహేష్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ వై.ఆంజనేయులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్



వస్త్రాలు, సబ్బులు, నూనె అందజేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలో పనిచేస్తున్న 100 మంది పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె, టవల్స్‌ను మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మతో కలిసి శనివారం అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే గతంలో ఇచ్చే సదుపాయాల కంటే ప్రస్తుతం ఎక్కువగా ఇస్తున్నామన్నారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ తెల్లవారక ముందే వీధుల్లోకి వచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కమిషనర్ జి.చంద్రయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, షేక్ మహ్మద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సహస్ర దీపాల సేవ



స్వామివార్లకు హారతులిస్తున్న మహిళలు

కోడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో శనివారం సహస్ర దీపాల సేవను కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్ల మూలమూర్తులకు తిరుమంజనసేవను భక్తిప్రపత్తులతో జరిపారు. అనంతరం ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యుల మంత్రోచ్ఛరణల నడుమ ఉత్సవమూర్తులకు పంచహారతులిచ్చి, పాశురపఠనం చేశారు. మహిళలు దీపాలను వరుస క్రమంలో ఏర్పాటు చేసి దీపాలసేవను నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో స్వామివార్లను ఊరేగించారు. ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

అవనిగడ్డ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీస్, జర్నలిస్ట్ ఫ్రెండ్లీ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను డీఎస్పీ పి. మురళీధర్ శనివారం రాత్రి ప్రారంభించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీధర్, సీఐ ఎల్. రమేష్, ఎస్ఐ జీ. రమేష్ కొద్దిసేపు షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో అవనిగడ్డ సర్కిల్ పరిధిలోని పోలీసులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

చెరువులో ఆటో బోల్తా : ఇద్దరికి స్వల్ప గాయాలు



ఆటోలో నుంచి ప్రయాణికురాలిని బయటకు తీస్తున్న కానిస్టేబుల్స్, స్థానికులు

పెడన: ప్రయాణికులతో వెళుతున్న ఆటో శనివారం చెరువులో బోల్తా కొట్టింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఇద్దరు కానిస్టేబుల్స్ స్పందించి ఆటోలోని వారిని సురక్షితంగా బయటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉరివి గ్రామానికి చెందిన దొండపాటి సత్యనారాయణ, శ్రీదేవి దంపతులు. వీరు ఉరివి గ్రామం నుంచి విజయవాడకు సొంత ఆటోలో లగేజీతో బయల్దేరారు. చేవేంద్ర గ్రామం దాటిన తరువాత ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి బోల్తాకొట్టింది. పెడన పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్ గోవాడ కోటేశ్వరరావు, ఎండీ రఫీ అదే సమయంలో అటుగా వెళ్తూ ఆటో బోల్తా కొట్టడాన్ని చూసి స్థానికులను పిలిచి ఆటోలోని ప్రయాణికులకు బయటకు తీశారు. ట్రాక్టర్ సాయంతో ఆటోను బయటకు తీశారు. భార్యభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం వారు విజయవాడ బయలుదేరి వెళ్లారు. కానిస్టేబుల్స్‌ను పలువురు అభినందించారు.

హెర్మోన్ ఐక్య పాస్టర్స్ సంఘ కమిటీ ఏర్పాటు

మోపిదేవి: మండల హెర్మోన్ ఐక్య పాస్టర్స్ సంఘం నూతన కమిటీ శనివారం ఎంపికైంది. మోపిదేవిలోని పి. రాజేష్ మందిరంలో పాస్టర్ల సమావేశం నిర్వహించారు. కమిటీ మండల ప్రెసిడెంట్‌గా గుర్రం ఇస్మాయిల్, వైస్ ప్రెసిడెంట్‌గా జె. శామ్యూల్, సెక్రటరీగా పి. సతీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా బి. యోహోషువ, ట్రెజరర్‌గా ఎం. రాజకుమార్, సబ్ ట్రెజరర్‌గా ఎస్. సుందరసింగ్, సభ్యులుగా టి. సంసోను, విజయకుమార్, ఆయోసు ఎంపికయ్యారని పాస్టర్ వి. పరిశుద్ధరాజు వివరించారు.